# పుచ్చిపోయిన జీవితం

అది కృతయుగం అనండి, స్వర్ణ యుగం అనండి, ధర్మం నాలుగు పాదాల నడిచిందనండి, ఏమన్నా, చరిత్రలో మానవ సమాజాలు బలంగా, పుష్టిగా, "మానవత్వపు విలువలు" అని మనం అనుకునేవి అమలులో ఉండిన కాలాలు కొన్ని కనిపిస్తాయి. వాటికి విరుద్ధంగా సమాజాలు పుచ్చిపోయి, అతి స్వల్ప ఆఘాతాలకు కూడా తట్టుకోలేక, శిథిలమైపోయిన సందర్భాలూ కనిపిస్తాయి — యాదవ కులంలో ముసలంలాగా

ఆదిమ మానవ సంఘాలను దృఢంగానూ, పుష్టిగానూ ఉంచినవి సాంఘిక నియమాలు వాటిని అమలుపరచటానికి పెద్ద శిక్షాస్మృతులు కూడా లేవు. అన్నిటినీ మించిన శిక్ష సంఘ బహిష్కారణం. అది ఆనాటి పరిస్థితులలో మరణదండన లాటిదే గనక సాంఘిక నియమాలను ఎవరూ ఉల్లంఘించేవారు కారు.

అయితే, నాగరికత పెరిగి సమాజంలోకి అనేక సంఘాలు వచ్చి చేరి, సంపద ఉత్పత్తి అయే క్రమంలో శ్రమ విభజన ఏర్పడి, అందులో ఎక్కువ తక్కువలూ, శ్రమదోపిడీ, దానితోబాటు సామాజిక దురన్యాయాలూ పుట్టుకొచ్చినాక, సమాజం విచ్ఛిత్తి పొందటానికి తగిన వైరుధ్యాలూ, సమాజం ఏకంగా ఉండటం అవసరం అయిన ఆర్థిక అవసరాలూ ఒకే సమయంలో ఏర్పడ్డాయి. సామాజిక ఐక్యతకోసం అంతర్గత వైరుధ్యాలను అణచిపెట్టటానికి రాజకీయ వ్యవస్థా, శాసనాలూ, శిక్ష విధానాలూ అవసరమయాయి అంటే మనుషులు రెండు రకాల కట్టుబాట్లను పాటించటం జరిగింది: ఒకటి, సమాజానికి సహజ శక్తిని కలిగించే సంఘనియమాలు. రెండు, అవసరమైతే దౌర్జన్యాన్ని ప్రయోగించగల శాసనాలు.

ఏ కాలంలో కూడా, సంఘనియమాలకున్న బలం శాసనాలకు లేదు ఈనాటికి కూడా, అత్యధిక సంఖ్యాకులకు శాసనాలతో పరిచయం లేదు. జనసామాన్యం సంఘ నియమాలలో మాత్రమే "న్యాయం" చూడగలరు అయితే సమాజం మారుతున్నకొద్దీ ఆ మార్పును అనుగుణంగా సంఘనియమాలు కూడా మారాలి లేకపోతే వాటి బలం నశిస్తుంది వాటిని జనం పాటించటం మానేస్తారు ఆ స్థితిలో సంఘం పుచ్చిపోకుండా రాజకీయ శాసనాలు ఆపలేవు.

ఈనాడు విరివిగా జరుగుతున్న రెండురకాల నేరాలను గమనిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.

***కొడవటిగంటి కుటుంబరావు***

ఒకటి బలవన్మైధునాలు - రేప్‌లు. స్త్రీలను చెరచినవాళ్ళు ఏ కాలంలోనూ ఉండే ఉంటారు. మరీ ప్రాచీన కాలంలో బృహస్పతి, గర్భవతిగా ఉన్న తన తమ్ముడి భార్యతో బలవంతంగా సంభోగించ యత్నించినట్టు మనకు రికార్డు ఉన్నది. అయితే, సనాతనులు కాదన్నప్పటికీ, మన పూర్వీకులకు కూడా ఒక అటవిక దశ ఉండేదన్నది నిజమే గనక బృహస్పతిది అనాగరిక చర్య అనుకోవచ్చు.

కాని నాగరికత వచ్చినాక, ఆడది సంభోగం కోరితే ఏ పురుషుడు గాని నిరాకరించటం ఎంత పాపమో, స్త్రీ ఇష్టానికి వ్యతిరేకంగా ఆమెతో రమించటం కూడా అంత పాపంగానే భావించబడేది. రాక్షసరతి అమానుషంగానూ, అనాగరికంగానూ భావించబడేది. రంభను బలాత్కరించిన రావణుడి కథ పురాణాలలో ఉన్నది. కాని ఆ రావణుడే సీతను బలాత్కరించలేదు. బ్రహ్మశాపం అడ్డొచ్చిందన్నారు గాని, ఆ మాట రామాయణంలో లేదు. రావణుడు రామాయణంలో గొప్ప రసికుడు. రసికుల్ రాక్షసరతీ, రేప్‌లూ కోరరు.

నా చిన్నతనంలో కూడా బలాత్కార మైధునం అన్నది సంఘ నియమాల దృష్టిలో ఎంత దారుణమైన నేరమంటే, 1925-28లో, నేను గుంటూరులో చదివే రోజుల్లో, ఒక పోలీసు ఎవరో ఖైదీ భార్యను బలాత్కరించాడు. ఆమె రిపోర్టు చేసేసరికి ఆ పోలీసువాడు తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తరువాత ఇటీవలి కాలంవరకు - అంటే మనకు స్వాతంత్ర్యం బాగా వంటబట్టి పోలీసులు శాంతి భద్రతలు కాపాడటానికి బీదవాళ్ళ ఇళ్ళలో జొరబడి కుండలు పగలగొట్టటమూ, ఏం నేరంచేసినదీ చెప్పకుండా కనిపించినవారిని చావగొట్టటమూ, క్రైమ్ క్స్ కింద ఆడవాళ్ళను రేప్ చెయ్యటమూ ఆనవాయితీ అయినదాకా - పోలీసులు తమ నిత్యకృత్యాలలో బలాత్కార మైధునాలు కూడా చేర్చుకోవటం ఎరగను.

రెండోది హత్యలు. గత జీవితంలో తనజాతివాణ్ణి చంపటంకంటె దారుణమైన నేరం ఊహించరానిది. గత నియమాలను శిరసావహించిన ఆఖరువాడు, చార్వాకుడు ధర్మరాజును, "నువు నీజ్ఞాతులను చంపావు. నువు చావాలి." అంటాడు గత జీవిత నియమాలు తెలిసిన ధర్మరాజు కాదనక, చావటానికి సిద్ధపడతాడు అయితే గత జీవితం బ్రాహ్మణులు అమలులోకి తెస్తున్న వర్ణవ్యవస్థకు విరుద్ధం. అందుచేత వాళ్ళు ధర్మరాజును చావవద్దని తామే చార్వాకుణ్ణి చంపుతారు.

వర్ణవ్యవస్థ ఆరంభమైనాక హత్యలు పూర్వం అంత ఘోరానేరాలు కాకుండా పోయాయి. వాటికేవో ప్రాయశ్చిత్తాలు

కూడా కల్పించారు. అన్ని హత్యలూ ఒకటి కావు కొన్ని హత్యలు నేరాలే కావు. తన తండ్రిని తిండికి మాడ్చి చంపిన అజాతశత్రువు ఉపనిషత్తుల్లో పెద్దమనిషే. రాజ్యాధికారంకోసం అడ్డం నిలిచిన తండ్రినీ, అన్నలనూ చంపటం మామూలు రాజనీతి అయింది. మొగలుల్లో కూడా దాన్ని ఆమోదించి, భారతీయ సంప్రదాయాన్ని నిలబెట్టినట్టున్నారు.

శిక్షాస్మృతిలో మరణదండన కూడా చేరింది. దాన్ని ఈనాటి సంస్కారులు "లీగల్ మర్డర్" అంటున్నారు. ఈ సంస్కారుల ఒత్తిడితో కొన్ని దేశాలు మరణదండనను విసర్జించి, యావజ్జీవ ఖైదు అమలుచేస్తున్నాయి. కాని ఈ సంస్కృతికి అతీతంగా హత్యలు జరుగుతున్నాయి పోలీసులు నక్సలైట్లను అడవిలోకి తీసుకుపోయి, కాల్చిచంపటం ఏ రకమైన హత్య? బిల్లా రంగాలు దారిలో దొరికిన పిల్లలను కారులో తీసుకుపోయి, ఆడపిల్లను చెరచి, ఇద్దరినీ హత్య చేయటం ఏరకమైనహత్య? వీటి వెనక పైశాచికం తప్ప ఏ రకమైన సంఘ నియమమైనా ఉండగలదా?

పైశాచికం అవహించిన చోట సంస్కృతి సమస్య లేదు. యాదవులు కొట్టుకు చచ్చేటప్పుడు వారిని వారించటానికి ప్రయత్నించిన కృష్ణుడు చివరకు అందరికన్నా ఎక్కువమందిని తానే చంపాడట!

ఏ రకం సంఘనియమాలకూ కట్టుబడకుండా పోయిన మనుషుల సంఖ్య నానాటికీ పాపంలు పెరిగినట్టు పెరగటం మనం రోజూ పత్రికలలో చూస్తున్నాం. ఇది సమాజ విచ్ఛిత్తిని సూచిస్తుంది. పరస్పరం నియమ రహితంగా ప్రవర్తించగల వాళ్ళు ఒక సమాజానికి చెందిన వాళ్ళు కారు. ఆదిమ జాతులలో కూడా మరో జాతివాణ్ణి చంపితే అది నేరం అయేది కాదు, కీర్తి కారణంగా కూడా ఉండేది.

రాజకీయ వ్యవస్థ ఏర్పడ్డాక చిల్లర మల్లర రాజులు ఇరుగుపొరుగు దేశాల పట్ల ఆ ఆదిమజాతి మనస్తత్వమే అవలంబించేవాళ్ళు. ఇరుగుపొరుగు రాజులతో యుద్ధాలు చేస్తూండటం క్షత్రియ ధర్మంగా కూడా చెప్పబడింది!

ఈ ఆదిమజాతి మనస్తత్వం ఇప్పుడు మళ్ళీ మన "ప్రజాతంత్రం"లోకి అడుగు పెట్టింది! అవతలి పార్టీ అభ్యర్థి గెలిచేటట్టుంటే వాణ్ణి చంపెయ్యి! ఈ పుచ్చిపోయిన వ్యవస్థను మార్చటానికి కృషి చేస్తున్నవాళ్ళను ఉగ్రవాదులని పేరు పెట్టి పోలీసుల చేత చంపించు!

మన దేశం కూడా, నాగరిక దేశాలలో లాగే, మరణదండన ఎత్తేస్తే బాగుండేదా అని అనవసరంగా తర్జనభర్జనలు పడుతున్నారు. మరణదండన ఎత్తివేయటంవల్ల చంపవలసిన వాళ్ళను చంపటానికి సవాలక్షమార్గాలున్నాయి. పోలీసుల లాకప్‌లో

చ్చినవాళ్ళను గురించి విచారణా, శిక్ష ఉండదు. "ఎన్‌కౌంటర్" చావులు సుప్రసిద్ధం అయ్యాయి. మరణదండన శిక్షాస్మృతి నుంచి ఎత్తేసి, మనంకూడా నాగరికులమే అనిపించుకోటానికి నిజంగా నాగరికులం కానవసరంలేదు. నాగరికత ఈనాడు అరువుసొమ్ము. రేపు మనకు "కలర్ టి. వి." రాబోతున్నది. నూటికి అరవైమందికి తిండి లేకపోయినా మనం కృత్రిమ ఉపగ్రహాలు ప్రయోగించగలం।

అందుచేత సంఘనీతి, సంఘనియమాలూ ఛిద్రమై సమాజానికి పునాది చిట్లిపోయి, భూకంపాలతో పోల్చదగిన సంఘటనలు సమిష్టి జీవితాలో జరుగుతున్నా మనం నాగరికతగల వారిలాగా వేషంవేసే అవకాశం ఉంది.

అలా వేషం వెయ్యటమే ఈనాటి సాంస్కృతిక కార్యక్రమమంతా —అకాడమీలూ, బాహూకృతులూ సన్మానాలూ, కళాప్రదర్శనలూ, కళాదౌత్యబృందాలూ. అంతర్జాతీయ సాంస్కృతిక సమావేశాలూ। ఇలాంటివి లక్ష చేసినా మానవసమాజం ప్రపంచం అంతటా శిథిలం అవుతున్నదన్న సత్యాన్ని దాచలేవు.

• • •

సమాజంలో ఐక్యత సాధించేశక్తులు లేవని నా ఉద్దేశం కాదు. కొన్ని అనుకూల శక్తులు కొన్ని వర్గాలను కూడగట్టి ఉంచుతున్నమాట నిజం.

అన్నిటికన్నా నిర్మలమైనదీ, దాదాపు నిరుపయోగమైనదీ కళారంగం. కళాభిరుచిలో సామ్యం సాంఘిక ప్రగతి శక్తులలో నిస్సందేహంగా ఒకటి, కాని బలీయమైనది కాదు. ఇతర శక్తులు అనుకూలిస్తే అది గొప్పగా రాణిస్తుంది.

కళాభిరుచివల్ల ఒక కవినిగాని రచయితనుగాని, గాయకుణ్ణిగాని, నటుణ్ణిగాని అభిమానించే వాళ్ళు ఏకమవుతారు. ఈ అభిరుచి సంఘంలో ఉండే మామూలు అడ్డుగోడ లన్నిటినీ దూసుకుపోగలదు. అలాంటి పరిస్థితిలో ఆయా కళాకారులు తమ కళల ద్వారా ప్రత్యేక సామాజిక ప్రయోజనాన్ని సాధించటానికి పూనుకున్నవారైతే కళాభిరుచులు గలవారు కనీసం మానసికంగా ఆ ప్రయోజనాలకు సుముఖులవుతారు.

మానసికంగా అని ఎందుకు చేర్చవలసి వచ్చిందంటే సంఘంలో సంస్కరణలు జరగాలని ఒప్పుకునేవారందరూ తామై వాటికి నడుముకట్టరు. సిద్ధాంత రీత్యా విప్లవాలు తప్పనిసరి అని ఒప్పుకునే వారంతా విప్లవాచరణను సహించగలరని అనుకోవటానికి లేదు. ఈ తేడా ఎందువల్ల వస్తుందంటే, సమాజం యొక్క భౌతిక పునాదులను కదిలించే శక్తి కళలకు లేదు; కదిలించ పూనుకున్నవారికి అవి ఊతం ఇయ్యవచ్చు, అంతే। ఇదే ప్రధానంగా కళలు సాధించే ఐక్యతలో ఉండే దౌర్బల్యం.

జనాన్ని ఏకంచేసేవి ఇంకా చాలా




ఉన్నాయి: రకరకాల బాబాలమీద భక్తి, క్రీడారంగం గురించిన ఆసక్తి, సాంస్కృతిక ఉద్యమాలలో సభ్యత్వమూ, రాజకీయ పార్టీలలో సభ్యత్వమూ వగైరాలు. ఇవి చాలామటుకు సమాజంలో ప్రత్యేక సంఘాలుగా రూపొందటానికి తోడ్పడతాయి గాని, మౌలికంగా సంఘ నియమాలపట్ల ప్రజలలో దృఢమైన విశ్వాసం కలిగించటానికి గాని, కాలానుగుణమైన మార్పులు వాటిలో తేవటానికి గాని పనికిరావు.

అంతేగాక ఈ కాలంలో ప్రజలు ఏ ప్రాతిపదికమీద ఏకంకావటానికైనా రాజకీయాలు అడ్డుతగలవచ్చు రష్యాలో జరగనున్న ఒలింపిక్ క్రీడల విషయంలో ఎంత రాజకీయ దుమారం రేగిందో మనం చూస్తూనేఉన్నాం. రాజకీయ కారణాలు అడ్డంపెట్టుకుని మంచి సాహిత్యాన్ని దుమ్మెత్తిపోస్తూ వస్తున్నవాళ్లు ఉంటూనే ఉన్నారు. "కమ్యూనిస్టు కవిత్వం", "కమ్యూనిస్టు సాహిత్యం" అనే అనిర్వచనీయమైన మాటలుకూడా సృష్టిఅయాయి। (ఏ కారణంచేతనో కాంగ్రెసు కథలూ, కాంగ్రెసు నవలలూ అన్న మాటలను ఎవరూ సృష్టించలేదు।) సాహిత్యం రాజకీయమైనదైతేనే దానికి రాజకీయమైన పేరు తగిలించాలి మార్క్స్, ఎంగెల్స్ లెనిన్, మావో రచనలను మార్క్సిస్టు రచనలు అనవచ్చు, కాని మావో కవిత్వాన్ని పట్టుకుని కమ్యూనిస్టు కవిత్వం అంటే తెలిసిన వాళ్ళు నవ్వుతారు. వీరరాజకీయ వాదులు నలుగురి ఎదుటా నవ్వులపాలు కావటానికి కూడా సిగ్గు పడబోరు.

రాజకీయాల ప్రభావం ఈ విధంగా ఉన్నకారణంచేత మౌలికమైన సాంఘిక, రాజకీయ సూత్రాలమీద మనుషులు ఏకమైతేతప్ప సమాజంతాలూకు పునాదులలో నిజమైన కదలిక రాదు.

విచారకరమైన విషయం ఏమంటే, చాలా రాజకీయ పార్టీలు "బోగస్" అనిపించే పేర్లు పెట్టుకుంటాయి వెనక "జస్టిస్ పార్టీ" ఉండేది. కాంగ్రెస్‌పార్టీ మానిఫెస్టోను యథాతథంగా కాపీకొట్టి, 1937 ఎన్నికలప్పుడు "పీపుల్స్ పార్టీ" అంటూ వచ్చింది. ఈనాడు "కాంగ్రెస్", "జనతా", "లోక్‌దళ్" లాంటి పేర్లతో అమ్ముడవుతున్న పార్టీలు సమాజాన్ని ఎటు నడిపించటానికి పుట్టాయో వాటి పేర్లు చూస్తే తెలీదు. ఆ పార్టీల నాయకులు చెప్పేదేమో నమ్మటానికి లేదు కాలచక్రాన్ని వెనక్కు తిప్పి క్రీస్తు పూర్వ స్థితిని తిరిగి నెలకొల్పటానికో, కాలచక్రాన్ని కదలకుండా గట్టిగా పట్టుకుని ఇప్పుడున్న ధనిక, దరిద్ర వ్యవస్థను ఇలాగే శాశ్వతంగా ఉంచటానికో, భవి. షత్తులో మరొక కృతయుగాన్నో, స్వర్ణయుగాన్నో సృష్టించి ధర్మాన్ని నాలుగు కాళ్ళమీదనో, ఎనిమిది కాళ్ళమీదనో నిలబెట్టటానికో అంకితమైనరాజకీయపార్టీలే వాస్తవమైన పార్టీలు. వాటిమధ్య జరిగే సంఘర్షణే నిజమైన సామాజిక చైతన్యం. అంతేగాని, దేశాన్ని దేశీయ, విదేశీయ ధనస్వాములకు తాకట్టు పెటేసి ఇదే సోషలిజం అనే పార్టీలు బోగస్‌పార్టీలు, ఒకటి చెబుతూ ఇంకొకటిచేసే పార్టీలన్నీ బోగస్ పార్టీలే జనసామాన్యాన్ని కూడ గట్టుకోకుండా జెండా లెత్తే పార్టీలు అసలు రాజకీయ పార్టీలేకావు. – మద్రాసులో కార్యదర్శి తప్ప సభ్యులులేని "సభం" లాగా।

